మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకాలం. ఢిల్లీలోని పార్లమెంటు వీధి దృశ్యం. రిజర్వుబ్యాంకువద్ద సిటీ బస్సుదిగి ఒక్కసారి చుట్టూవున్న ఎత్తయిన భవనాలవైపు దృష్టి సారించాను. భవనాలముందు అందమైన చిన్న గార్డెన్సు కొద్ది లాన్సుతో చూడటానికి అందంగాఉండి భవనాలకు మరింత కళనిస్తున్నవి. లాన్లనిండా రకరకాల డ్రస్సులతో ఉద్యోగస్తులు చిన్నచిన్న గుంపులుగా కూచొని కబుర్లు చెప్పుకుంటూ మధ్యమధ్య పెద్దగా నవ్వుకుంటూ టిఫిన్ బాక్సులలో తెచ్చుకున్న ఫలహారాలు తింటున్నారు. చాలామంది సూట్లలోనే ఉన్నారు. అందులో కొంతమంది కోట్లను విప్పి తొడలమీద పెట్టుకొన్నారు కూర్చొని చలికాలం గనుక మధ్యాహ్నమైనా చలిగానే ఉన్నది. మధ్యమధ్య చలిగాలి వీచినప్పుడు చలి బాగా అనిపిస్తున్నది. రోడ్డుమీద వచ్చే పొష్యే కార్లతో, సిటీ బస్సులతో, సిటీ బస్సులందుకోవడానికి పరుగెత్తే మనుష్యులతో రోడ్డంతా సందడిగాఉంది. జేబులో నుండి అడ్రసుతీసి చూసుకొని ప్రక్కనే వెళ్తున్న ఒకాయన్ను అడిగాను సెంట్రల్ స్టాటికికల్ ఆర్గనైజేషన్ ఎక్కడని. ఆయన పక్కనేఉన్న ఒక పెద్దభవనం వైపు చూపిస్తూ అందులో మూడవ అంతస్థులో ఉన్నది అని చెప్పాడు హడావిడిగా వెళ్తూ.

లోపలకు వెళ్ళాను. ఎన్ట్రెన్సుకు దగ్గరలోనేఉన్న రిసెప్షనిస్టువద్దకు వెళ్ళి డాక్టర్ టి. కె. మూర్తిని కలుసుకోవాలని అడిగాను. ఆమె ప్రస్తుతం రెండుకొట్టేవరకు ఆఫీసుకు లంచికైమనీ, రెండుకాగానే ఆయనకు ఫోనుచేసి కనుక్కొని ఆయన పంపమంటే పాస్ఇచ్చి పంపుతాననీ చెప్పి, అప్పటిదాకా వెయిట్చెయ్యమని ప్రక్కనే వరుసగా ఉన్న కుర్చీలవైపు చూపించింది. థాంక్స్చెప్పి కుర్చీలో కూలబడ్డాడు.

మనస్సు స్థిమితంగాలేదు. ఆ టి. కె. మూర్తిగారు ఏమంటాడో, ఖాళీలేమయినా ఉన్నయ్యంటాడో, ప్రస్తుతం ఏమీలేవు పొమ్మంటాడో. అసలు సరిగా మాట్లాడతాడో మాట్లాడడో. బహుశ మాట్లాడవచ్చు. ఆయనకు వీలయితే సహాయం కూడా చెయ్యవచ్చు. ఎందుకనంటే, తను ఢిల్లీ వస్తూ ఆగ్రాలోదిగి చౌదరిగారిని కలుసుకొని, నేను ఎం.ఎస్.సి. చదువుతూ ఆగ్రాలో ఉన్న రెండేళ్ళలో ఆయనతోఉన్న పరిచయాన్ని పురస్కరించుకొని ఆయనకు ఢిల్లీలో పెద్దహోదాలోఉన్న స్నేహితులెవరైనాఉంటే వాళ్ళ కిలెటర్స్ వ్రాసియిస్తే వాటిని నేను ఉద్యోగం సంపాదించుకోవడానికి ఉపయోగించుకొంటానని అడిగినప్పుడు ఆయన, ఓ. అలాగే. కాని మీ స్టాటిస్టిక్సుకు సంబంధించిన పెద్ద ఉద్యోగాలలో నాకు అంతగా ఎవరూ తెలియదు. అయినా సి. యస్. ఓ. లో ఉన్న టి. కె. మూర్తి మీ లైనులోవాడే కనుక అతనివల్ల మీకే

పైగా లాభం కల్గవచ్చునని ఆయనకు అలాగే ఫుడ్ అండ్ ఎగ్రికల్చర్ మినిస్ట్రీలో, డిప్యూటీ డైరక్టరు డాక్టరు సూర్యనాథం అనే ఆయనకూ ఉత్తరాలు వ్రాసి యిచ్చారు. చౌదరిగారు చాలా పెద్ద మనిషి. సహాయకారి. పైగా పెద్ద ఉద్యోగంలో ఉన్నారు. అందువల్ల ఈ టి. కె. మూర్తి గారు చౌదరిగారి ఉత్తరానికి విలువ యివ్వవచ్చు. అయినా ఖాళీలు లేనప్పుడు, ఆయన ఏమీ చెయ్యగలిగింది లేనప్పుడు ఆయన మాత్రం ఏం చేస్తాడు. అసలు ఈ వెధవ స్టాటిస్టిక్సు ఎమ్మెస్సీ చదవకుండా మరొక సబ్జక్టు చదవాల్సింది. ఇంత బొత్తిగా ప్రాస్పెక్టు ఉండవని అనుకోలేదు. మే లో రిజల్ట్సు వచ్చింది మొదలు యిప్పటిదాకా గుంటూరునుండి సుమారు 10, 12 ఉద్యోగాలకు అప్లై చేసినా ఒక్కడూ యింటర్వ్యూకు కూడా పిలవలేదు. హాయిగా బి.యి. మెకానికల్ చదవాల్సింది, చేరటమే కనీసం 400 రూ.లు వచ్చే ఉద్యోగంలో చేరేవాడ్ని. బి.యస్సీలో వచ్చిన హై ఫస్టు క్లాసు బాగా ఉపయోగించుకో లేకపోయాను. అయినా యిప్పుడనుకొని ఏం లాభంలే; అలా రాసిపెట్టుంది, జరిగింది. చివరకు ఈ స్టాటిస్టిక్సు లైనులోనన్నా పైకివచ్చేందుకు ప్రయత్నం చెయ్యాలి.

'మిస్టర్! మీ పేరు, అడ్రసు, కాగితం మీద రాసివ్వండి డాక్టరు మూర్తికి ఫోను చేస్తాను' అని అడిగింది రిసెప్షనిస్టు ఆమె టేబుల్ మీద ఉన్న కాగితాల వైపు చూపిస్తూ. దాని మీద 'పి.యల్. మూర్తి ఫ్రమ్ శ్రీ ఎస్. కె. చౌదరి, ఆగ్రా' అని వ్రాసిచ్చాను. ఆమె ఫోను చేసి నాకు పాస్ యిచ్చి 306 నెంబరు రూము అని చెప్పింది. కొద్ది నిముషాలలో ఆ రూముకు వెళ్ళాను. బయట ప్యూన్ కూర్చొని ఉన్నాడు చీటి అతనికి యిచ్చాను. అతను లోపలకు వెళ్ళి వెంటనే తిరిగివచ్చి సాబ్ రమ్మంటున్నారు అని హిందీలో చెప్పాడు. 'డాక్టర్ టి. కె. మూర్తి; డిప్యూటీ డైరక్టర్' అని వ్రాసి ఉన్న తలుపును నెట్టుకొని లోపలకు వెళ్ళి 'గుడ్ ఆఫ్టర్ నూన్ సార్' అన్నాను. ఆయన తెలుగులో 'రండి, కూర్చోండి' అని ఆహ్వానించి కూర్చొన్న తర్వాత 'ఏమిటి విశేషాలు; చౌదరి బాగున్నాడా?' అని మొదలు పెట్టారు. ఏకవచన ప్రయోగం చేస్తున్నాడీయన, బహుశ చౌదరిగారితో బాగా పరిచయం ఉండవచ్చు అని అనుకొంటూ 'బాగానే ఉన్నారండి, ఈ ఉత్తరం మీకిమ్మన్నారు' అని యిచ్చాను. ఉత్తరం చదివాక ఆయన 'ఈ మధ్యనే 7, 8 మంది ఎమ్మెస్సీ స్టాటిస్టిక్సు, ఎకనామిక్సు వాళ్ళను తీసుకొన్నామండి. ప్రస్తుతం ఏమీ రిక్రూట్‌మెంటు లేదు. ఏదైనా వీలయితే మీకు తప్పకుండా తెలియపరుస్తాను' అని డెస్క్ డైరీలో నా పేరు, అడ్రస్ వ్రాసుకున్నారు.

'పోనీ, మీకు తెలిసినచోట్ల ఎక్కడైనా వేకన్సీలు ఉంటే మీ ద్వారా ట్రై చేస్తే బాగుంటుందని నా ఉద్దేశ్యం.'

'అలాగే కానీండి. ప్రస్తుతం నేషనల్ కౌన్సిల్ లోనూ, నేషనల్ శాంపుల్ సర్వే లాంటి వాటిల్లో కూడా ప్రయత్నం చేసి చూడండి.'

'మీకు అక్కడ తెలిసిన వాళ్ళెవరైనా ఉంటే వాళ్ళకు మీరు ఫోనుచేస్తే నేను కలుసుకుంటాను సార్'.

'నేషనల్ కౌన్సిల్‌లో కె. యస్. రామా రావుగారని స్టాటిస్టికల్ ఆఫీసరు ఒకాయన ఉన్నారు' ఆయన్ను కలుసుకోండి నేను చెప్పానని చెప్పండి.'

కాగితంమీద ఆ ఆఫీసుపేరు వ్రాసి యిచ్చారు.

'మీరు ఫోనుచేస్తే....' సణిగాను.

'అలాగే. మీరు వెళ్ళిరండి.'

ఈయన సహాయంచేసేటట్లుగానే ఉన్నాడనుకుంటూ రోడ్డుమీదకువచ్చి బస్సు నెంబరు తెలుసుకొని 'నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లయిడ్ ఎకనామిక్ రీసర్చి' చేరుకున్నాను. రామారావుగారిని కలుసుకొని 'డాక్టరు మూర్తి మీకు ఫోను చేసారనుకుంటాను నా గురించి' అన్నాను నేను ఎందుకు వచ్చింది చెప్పి, యింగ్లీషులో.

'మీ క్వాలిఫికేషన్' అన్నారాయన తెలుగులో మాట్లాడుతూ.

'ఎమ్మెస్సీ స్టాటిస్టిక్సు.'

తర్వాత సంభాషణంతా తెలుగులోనే జరిగింది.

'ఏ క్లాసు.'

'హై సెకండుక్లాసు.'

'ఏ సంవత్సరం.'

'58.'

ఫస్టుక్లాసు వచ్చుంటే బాగుండేది ఇక్కడ ఇంటర్వ్యూయర్ ఉద్యోగాలకు అంతా ఫస్టుక్లాసు వాళ్ళనే యింతవరకు తీసుకుంటున్నారు. సరే. ప్రస్తుతం కొద్ది వేకన్సీలు ఉన్నట్టున్నాయి. ఎప్పుడు ఫిల్ అప్ చేస్తారో తెలియదు. బహుశ 2, 3 నెలలు పట్టవచ్చు. ఆఫీసులో అప్లికేషన్ యిచ్చివెళ్ళండి. నెలా, నెలా పదిహేనురోజుల తర్వాత నన్ను కాంటాక్టు చెయ్యండి.

'అలాగేనండి థాంక్యూ వెరీమచ్.'

'ఫరవాలేదు వెళ్ళిరండి.'

అప్లికేషన్ యిచ్చి బయటపడ్డాను. ఇంక ఎక్కడికెళ్ళడం అని కాసేపాలోచించి చౌదరిగారిచ్చిన రెండవ ఉత్తరం గుర్తుకువచ్చి నేషనల్ శాంపుల్ సర్వేకు తర్వాత వెళ్ళచ్చునుకొని, సూర్యనాథంగారిని కలుసుకొందామని బస్సునెంబరు ఎవరినో అడిగి తెలిసికొని బస్సెక్కి 'కృషిభవన్'కు వెళ్ళాను. అప్పటికి టైము సుమారు నాలుగున్నరయింది. రిసెప్షనిస్టును అడిగాను డాక్టర్ సూర్యనాథంను కలుసుకోవాలని ఆమె ఫోనుచేసి ఆయన ఈరోజు సెలవలో ఉన్నారని చెప్పింది. ప్రాణం ఉసూరుమనిపించింది యింతదూరం అనవసరంగా వచ్చానే అని. ఇంతలో అక్కడున్న ఒకతను డాక్టరు సూర్యనాథం మర్నాడు కూడా రాకపోవచ్చనీ ఆయన వారం పదిరోజులలో అమెరికా వెడుతున్నారనీ అందువలన ఆయన్ను యింటివద్ద కలుసుకోవడం మంచిదని చెప్పాడు. ఆయన యింటి అడ్రసు నోటుచేసికొన్నాను అతనినుండి. బయటకు వచ్చాను. మధ్యాహ్నం కాఫీ త్రాగకపోవడం వల్ల తలనొప్పిగా ఉంది. ఆ ఆఫీసు కాంటీనులో కాఫీ త్రాగి కరోల్‌బాగ్‌లో ఉన్న మా మెస్ (బోర్డింగు అండ్ లాడ్జింగు)కు బస్సెక్కాను 20 నిముషాలు ఆ బస్సుకోసం వెయిట్‌చేసి, అది వచ్చిన తర్వాత తగినంత కుస్తీపట్టి.

మర్నాడుదయం 8 గంటలకు కాలకృత్యాలు తీర్చుకొని, నీటుగా డ్రస్సుఅయి పూసారోడ్డులోనున్న సూర్యనాథంగారింటికి బయలుదేరాను. వాళ్ళనీ వీళ్ళనీ అడుగుతూ 8—30కు ఆయింటిని కనుక్కోగలిగాను.

ఇన్‌ఫ్లుయెన్సు

గేటు తీసుకొని నెమ్మదిగా లోపలకు నడిచాను. వరండాలో ఒక నడివయస్సాయన లుంగీ కట్టుకొని పొట్టిచేతులచొక్కా, స్వెట్టరూ వేసుకొని కుర్చీలో కూచొని పేపరు చదువుకొంటున్నాడు. బహుశ ఆయనే సూర్యనాథంగారని అనుకొంటూ, మెస్సులో నా ప్రక్కగదిలో ఉంటూ, కృషీ భవన్‌లో పనిచేస్తున్న ఒక యు. డి. సి సూర్యనాథం బహుకోపిష్టి అని, చాలా స్ట్రిక్టుమనిషనీ రాత్రి చెప్పిన విషయం, గుర్తుకొచ్చి బిక్కుబిక్కుమంటూ వరండాలో అడుగుపెట్టి అడిగాను యింగ్లీషులోనే.

'డాక్టర్ సూర్యనాథం ఎక్కడఉంటారు'

వెంటనే గద్దించినట్లు సమాధానం వచ్చింది.

'నేనే సూర్యనాథాన్ని ఏంకావాలి'

గొంతుతడారిపోతుండగా.

'నేను ఆగ్రాలోని చౌదరిగారినుండి వస్తున్నాను'

వెంటనే ఆయన తెలుగులో.

'రండి,రండి. మీరు చౌదరిచుట్టాలా?' అన్నారు లోపలికి దారి చూపిస్తూ ఆయన కూడా లేచి లోపలికి నడుస్తూ.

ఏమి సమాధానం చెప్పాలో తోచక మౌనంగా ఆయనవెంట ముందు గదిలోకినడిచాను మళ్ళీ అడిగారు ఆయన.

'చౌదరి మీకు బంధువా?'

'కాదండి స్నేహితులు' అన్నాను, ఉత్తరం తీసియిస్తూ.

'స్నేహితుడా' అన్నారు ఆయన 28 ఏళ్ళ నాకూ, 45 ఏళ్ళుండి పెద్ద పదవిలోనున్న చౌదరిగారికి స్నేహమేమిటని కాబోలు ఆశ్చర్యపోతూ.

'……'

ఉత్తరం చదువుకున్నారు.

'మీరు ఏ ఉద్యోగానికి ట్రైచేస్తున్నారు?'

'స్టాటిస్టికల్ అసిస్టెంటు ఉద్యోగానికండి.'

'210—425 స్కేలుదా?'

'అవునండి.'

ప్రస్తుతం ఎక్కడన్నా యింటర్వ్యూ వచ్చిందా?'

'ఇంకాలేదండి.'

'నేనూ ఎక్కడన్నా కనుక్కుంటాను. మీరుకూడా ప్రయత్నంచెయ్యండి ఎక్కడైనా యింటర్వ్యూవస్తుందేమో.ఇంటర్వ్యూవస్తే అందులోఉండే మెంబర్లలో ఎవరితోనైనా మాట్లాడవచ్చు.

'అలాగేనండి' మీ ఆఫీసులో ఏమైనా...

'మా ఆఫీసులో కుదరదు' నిర్మొహమాటంగా చెప్పారు. కొంచెం కష్టమనిపించింది నాకు. ఇంతలో టీ వచ్చింది.

'టీ తీసుకోండి.'

'నేను తీసుకొనే మీ యింటికి బయలుదేరానండి.'

'మరేం ఫరవాలేదు. మరోమారు తీసుకోవచ్చు. మొహమాటపడకండి' తీసుకున్నాను.

'వస్తానండి. మీకు మళ్ళీ ఎప్పుడు కన్పించమంటారు?'

'3, 4 రోజులాగిరండి. అయినా నేను 10 రోజుల్లో డెప్యుటేషన్‌మీద అమెరికా వెడుతున్నాను. ఈలోగా 24 రోజులు మా ఊరు వెళ్ళిరావాలి. మీకు నేను ఎక్కువ సహాయపడటం ఈకొద్ది వ్యవధిలో కష్టం. అయినా చూద్దాం వెళ్ళిరండి.'

* * *

ఆరోజురాత్రి మెస్సులో భోజనాలయింతర్వాత అజ్మల్‌ఖాన్ రోడ్డుమీదకువచ్చి కిళ్ళీ వేసుకొంటూంటే ఆగ్రాలో మా హాస్టల్లో ఉండి ఎమ్.ఏ సోషియాలజీ చదివిన రామ్మోహన్ కన్పడ్డాడు. ఎప్పుడూ నవ్వుతూ హుషారుగా ఉంటాడు. కబుర్లపుట్ట. ఎన్నిగంటలయినా అనర్గళంగా కబుర్లు దంచుతూనే ఉంటాడు మనం మధ్యలో ఆపకపోతే. హాస్టల్లో ఉండగా తరచూ నా రూముకు వచ్చి బాతాఖానీ వేసేవాడు. అతనిలో ఉన్న మంచితనం ఏమిటంటే—అతని వాక్ప్రవాహానికి మనం అడ్డుపడి 'రామ్మోహన్‌గారూ! ఇంక చదువుకోవాలి మీరు ఏమీ అనుకోకపోతే—' అంటూండగానే 'హ్హా! భ్హా లేవాలే! అనుకోటం ఎందుకు సార్. నేను బాగా చదవనని మీ చదువు చెడగొడతా ననుకున్నారా. హాయిగా చదువుకోండి. చదివి చదివి బోరుకొడితే మాత్రం నన్నుకేకెయ్యండి. మళ్ళీ గాసిప్పేసుకుందాం' అని, ఈల వేసుకొంటూ వెళ్ళిపోయేవాడు. సాధారణంగా వరండాలో ఈల విన్పడితే అతను వస్తున్నట్లు గుర్తు. అందుకని తెలుగువాళ్ళలో కొందరం అతన్ని ఈలవాగోపాల్ అని పిల్చుకునేవాళ్లం. పరీక్షలయిన తర్వాత అతను మళ్ళీ యిదే కన్పడటం. నన్ను చూసి చూడ్డంతోటే—

'హల్లో మూర్తిగారు! ఎప్పుడు రావడం? ఏమిటి విశేషాలు? హ్హా! భలేగా కలిశారండీ' అన్నాడు నవ్వుతూ.

నేను ఎప్పుడు, ఎందుకు వచ్చిందీ చెప్పి అతని విషయం అడిగాను. అతను నవ్వుతూ 'ఇంకా యింత దూరం ఎందుకు వస్తాం సార్. నేనూ అందుకే. ఈ రోజుల్లో చాలా మంది పోస్టుగ్రాడ్యుయేట్‌లు. డాక్టరేట్‌లు పాస్ అయిన వెంటనే బొంబాయికో, ఢిల్లీకో రైలెక్కుతున్నారు ఉద్యోగాలకోసం. నేనిప్పుడు రామానుజం మెస్సులో ఉంటున్నాను, రండి నాతో; చూపిస్తాను యింకా ఎంతమంది ఈ ఉద్యోగపు వేటగాళ్ళున్నారో. అసలు ఈ కరోల్‌బాగ్‌లో ఉన్న మెస్సులను సగం పోషిస్తున్నదీ వాళ్ళూనూ, మిగతాది ఉద్యోగం వచ్చి సంసారాలు లేనివాళ్ళూనూ. రండి రూముకుపోయి మాట్లాడుకుందాం. అని దోవ తీశాడు.

రూములో అడిగాను. ఏ క్లాసు వచ్చిందని!

'ఇంకే క్లాసు సార్! జనతా! హ్హా!హ్హా!హ్హా. అది మనకు తప్పదు. నార్తిండియా రావడం మొదలుపెట్టి 3 ఏళ్ళయింది. ఇంతవరకు 10, 12 సార్లు ఈ మెయిన్ లైన్ మీద రైళ్ళలో తిరిగాను. అన్నిసార్లు జనతా ఎక్స్‌ప్రెస్‌లో వచ్చి వెళ్ళక తప్పలేదు. పరీక్ష అయింతర్వాత మాత్రం పట్టుబట్టి, నానా అవస్థలు పడి, జి. టి. ఎక్స్‌ప్రెస్‌లో యింటికి వెళ్లాను ఎమ్. ఏ. వరకు అన్నీ థర్డు క్లాసులే కనుక. అయినా తప్పలేదు మూర్తిగారూ! లైఫంతా జనతా అయిపోయింది సార్!' అన్నాడు విచారం నవ్వూ మిళాయిస్తూ.

నాకు జాలేసింది. రామ్మోహన్ స్వతహాగా తెలివయినవాడు. సూక్ష్మగ్రాహి. కాని అతను పరీక్షలను చాలా తేలికగా తీసుకొనేవాడు. పట్టుబట్టి చదవలేకపోయేవాడు. ఎప్పుడన్నా మూడ్‌వచ్చి సీరియస్‌గా చదువు మొదలుపెట్టి 1, 2 రోజులు చదవగానే యింతలో ఎవడో ఒక స్నేహితుడు సినిమాకు బయలుదేరదీసేవాడు. అంతే. ఆ మూడ్‌కు అంతటితో ఫుల్‌స్టాప్ ఒకటి ఒకటిన్నరనెలలవరకు మొదట్లో, పిలవక

సి చెయ్యడానికి 2, 3 నెలలు చాలులే అని అశ్రద్ధచేసేవాడు. పరీక్షలు రెండు మూడునెలలుండగా చదువు మొదలుపెట్టి చదివాల్సింది అర్థంచేసుకొని నిరాశపడి పోయేవాడు.

'ఏమైనా ఛాన్సులు కన్పడుతున్నాయా మీ ప్రయత్నంలో' అడిగాను.

'లేదుసార్. ఈ ఊళ్లో మా బావగారు ఫైనాన్సు మినిస్ట్రీలో డిప్యూటీ సెక్రటరి. ఆయనద్వారా ప్రయత్నంచేస్తున్నా. వచ్చినెల లో జాబయింది. ఐ.ఏ.ఎస్.కుగాని, ఎల్లైడ్ సర్వీసెస్ కుగాని కొట్టొందామని ఈ రూములోచేరాము, ఎన్నాళ్లు మట్టాలింట్లో ఉంటామని. అన్నట్లు మీ ప్రయత్నాలెంతవరకువచ్చాయి?' జరిగింది చెప్పాను. తర్వాత మాటల్లో తనకుగూడ నాకు మాదిరే యిద్దరు ముగ్గురు ఆఫీసర్లు తన పేరు నోటుచేసుకొన్నారని. తర్వాత కనబడ మన్నారని చెప్పాడు.

* * *

మర్నాడు 'ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్' అనే ఆఫీసుకువెళ్లాను. రామ్మోహన్ అందులో వేకెన్సీలు ఉన్నట్లు విన్నానని రాత్రి చెప్పిన దానినిబట్టి అక్కడ రిజిస్ట్రారును కలుసుకొన్నాను. ఆయన 5, 6 రోజుల్లో యింటర్వ్యూలు జరుగుతవనీ అప్లికేషనిచ్చి వెళ్తే కబురంపుతామనీ చెప్పాడు. నావద్ద రెడీగాఉన్న అప్లికేషనుపై ఆ ఆఫీసు అడ్రసు వ్రాసి

ఇన్ ఫ్లుయెన్సు

యిచ్చివచ్చాను. మూడురోజుల తర్వాత యింటర్వ్యూ లెటర్వచ్చింది. అది తీసికొని సూర్యనాథంగారింటికి వెళ్లాను. ఆయన అప్పుడే ఊరినుండి వచ్చారు. సంగతివిని ఆ యింటర్వ్యూకమిటీలో బహుశ జైన్, శ్రీవాత్సవ, గుప్త అనేవాళ్లుంటారనీ, తను శ్రీవాత్సవతో మాట్లాడుతాననీచెప్పి, యింటర్వ్యూకు బాగాతయారయివెళ్లమనిచెప్పారు. ఆయన ఎటూ ఫారిన్‌వెడుతున్నారుకదా అని గుర్తొచ్చి 'మీరు వెళ్లేలోగా ఎవరికన్నా ఇంట్రడక్షన్ చేసివెళ్తే నేను వాళ్ళద్వారా కూడా ప్రయత్నంచేస్తాను' అన్నాను. ఆయన 'అలాగే. నేషనల్ శాంపుల్ సర్వేలో సుబ్రహ్మణ్యమని స్టాటిస్టికల్ ఆఫీసరు ఉన్నాడు, ఆయనన్నా, సప్లైస్ అండ్ డిస్పోసల్స్‌లో డాక్టర్ జి. యం. సింగ్ అనే అసిస్టెంటు డైరెక్టరు ఉన్నాడు, ఆయనన్నా కలుసుకోండి. నేను వాళ్లతోచెప్పి వెళతాను' అన్నారు.

అప్పటినుండి ప్రయత్నాలుమానేసి యింటర్వ్యూకు చదవడం మొదలుపెట్టాను. బాగానే ప్రిపేరయి వెళ్లాను. ఇంటర్వ్యూలో సంతృప్తికరంగానే జవాబులు చెప్పాను. ఇంటర్వ్యూ తర్వాత 2, 3 రోజులు ఫిన్సు సైన్సులేబరేటరీలోనూ, ఆర్మీ స్టాటిస్టికల్ ఆర్గనైజేషన్లోనూ, మరి కొన్ని ప్రైవేటు కంపెనీలలోనూ కనుక్కొని అనిపించుకొన్నాను. సూర్యనాథంగారు చెప్పిన నేషనల్ శాంపుల్ సర్వేలోని సుబ్రహ్మణ్యం గారిని కలుసుకొని సూర్యనాథంగారు కలుసుకోమన్నట్లు చెప్పాను. ఆయన ఏమిటేమని అన్నారు. సూర్యనాథంగారు చెప్పలేదా అని ఆశ్చర్యపోతూ నాపని చెప్పాను. ఆయన 'ఏమీ ఖాళీలులేవు. ఇప్పట్లో వేకెన్సీలువచ్చే అవకాశాలుకూడలేవు' అన్నారు. అంటూ ప్రక్కసీటులో కూర్చొన్నాయనకేసి చూశారు నవ్వుతూ. బయటకువచ్చాను. అక్కడనుండి సింగుగారివద్దకుపోయాను. సింగుగారు ప్రస్తుతం ఖాళీలులేవని, నెలరోజుల్లో ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజిద్వారా 4, 5 పోస్టులురిక్రూట్ చేస్తామనీ, కనుకఎంప్లాయిమెంటు ఎక్స్చేంజిలో రిజిస్టరుచేసుకొని, తన ఆఫీసువాళ్ళు కావలసినట్లు లిస్టు పంపమని ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజిని కోరగానే తన పేరుగూడ ఆలిస్టులో పంపేటట్లు చేసుకోమనీ చెప్పారు. అంతవరకువస్తే అప్పుడు తను ప్రయత్నం చెయ్యగలననీచెప్పారు. ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజిలో ఢిల్లీరాగానే రిజిస్టరు చేసుకున్నాను. కాని అప్పుడే ఎలా నాపేరు పంపుతారు? సంవత్సరం క్రిందట రిజిస్టరు చేసుకొన్నవాళ్ళ టర్నే యింతవరకు రాలేదని తెలిసింది. ఇక నా సంగతేమిటి. ఆలోచించుకుంటూ రూము చేరాను.

మర్నాడు, మళ్ళీ సి. యస్. ఓ లోని మూర్తిగారివద్దకు వెళ్ళాను. ఆయనకి సంగతిచెప్పి ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజిలో ఆయనకు తెలిసినవాళ్ళెవరైనా ఉన్నారేమోనని అడిగాను. ఆయన తనకు 'డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ ఎండు ట్రైనింగ్'లో అసిస్టెంటు సెక్రటరీ రెడ్డిగారు తెలుసనీ, ఆయన్ను కలుసుకోమనీ చెప్పారు. తను ఆయనకు టెలిఫోను చేస్తానని కూడా అన్నారు. రెడ్డిగారి ఆఫీసుకు వెడితే ఆయన టూరులో ఉన్నారనీ, ఆయన తిరిగిరావడానికి యింకా 3, 4 రోజులు పట్టవచ్చునీ ఆయన ప్యూను చెప్పాడు. వాడితో కొంచెం కబుర్లు మొదలెట్టాను రెడ్డిగారిని గురించిన వివరాలేమయినా తెలుసుకోవచ్చని. అతను, అయ్యగారు సాధారణంగా తెలుగువాళ్ళకు సహాయం చేస్తాడని చెబుతూ మీరు తెలుగువాళ్ళేనా అని అడిగాడు. నేను సమాధానం చెప్పకుండా నవ్వు



ఎక్కడివాడివి అని అడిగాను. అతను యు.పి. వాడినని చెప్పాడు. మళ్ళీవస్తాతే అని చెప్పి వచ్చేశాను.

మరో 3, 4 రోజులు రాత్రిళ్ళు రామ్మోహన్‌తో హస్కు, పగలు మరికొన్ని ఆఫీసులు, కంపెనీలకు తిరగడంతో గడి చాను. వాటిలో రెండోరోజుమాత్రం ఢిల్లీ క్లాత్ మిల్స్‌లో అడిగితే, ఆ మర్నాడు అక్కడ సైంటిఫిక్ అసిస్టెంట్లకు సెల క్షను జరుగుతుందనీ, నేనుగూడ టెస్టుకు రావచ్చనీ, చెప్పాడు పర్సన్నల్ ఆఫీసరు. మర్నాడువెళ్ళి రిటెన్‌టెస్టు వ్రాశాను. 36 మంది వచ్చారు పరీక్షకు, అందులో బి.యస్సీ.ఫస్టుక్లాసుఉన్నవాళ్ళం నలుగురం ఎమ్మెస్సీలు అరుగురం, ఆ టెస్టులో అరుగురు సెలక్టయినట్లు చెప్పి వాళ్ళ పేర్లు చదివి, వాళ్ళు ఆ మర్నాడు 10 గంటలకు యింటర్వ్యూకు రావచ్చని చెప్పారు. అందులో నేనుకూడా ఉన్నాను గనుక మర్నాడు యింటర్వ్యూకువెళ్ళాను. రికమెండేషన్‌కోసం ప్రయత్నంచేసే టైము లేకపోయింది. అలాగే వెళ్ళాను. ఇంట ర్వ్యూకువచ్చిన వాళ్ళలో నలుగురు ఎమ్మెస్సీలు యిద్దరు బియస్సీలు ఉన్నారు. అందులో ఒక తను బొంబాయినుండివచ్చాడు. అతను తను సెలక్టవుతానని ధీమాగా ఉన్నాడు. తనూ ఏమ్మెస్సీ కనుకనూ, 3 ఏళ్ళ అనుభవం ఉంది కనుకనూ, తను అప్లికేషనులో 400కు జీతం తక్కువ యిచ్చేటట్లయితే యింటర్వ్యూకు పిలవవద్దని రాశినా సెకండ్ క్లాస్ చార్జీలిచ్చి యింటర్వ్యూకు పిలిచారు కనుకనూ. ఇంటర్వ్యూలు అరగంటలో అయి పోయినవి. ఒక బి యస్సీ (సెకండ్ క్లాసు) అతను సెలక్టయినట్లు ఎనౌన్సు చేశారు. నాకు ఆశ్చర్యం కలిగింది ఎమ్మెస్సీవాళ్ళలో ఎవరూ సెలక్టు కాలేదే అని. ఇదే తర్వాత రామ్మోహన్‌తో అంటే 'అదొకరకమైన ట్రిక్కు, ఎమ్మెస్సీ ఒకట్రవ క్లాసు వాళ్ళను తీసుకుంటే మొదటవాళ్ళకు కనీసం 350, 400 రూపాయలు యివ్వాలి. వాళ్ళు ఉద్యోగంలోచేరి కొంత అనుభవం గడించగానే మరోచోట ఇంకోవందో, రెండొందలో ఎక్కు విస్తామని ఆఫర్లువస్తాయి. అప్పుడువాళ్ళను పోకుండా చేసుకుంటానికి అంత జీతం ఈ కంపెనీవాళ్ళు యివ్వాలి. అలా కాకుండా బియస్సీ సెకండుక్లాసువాడైతే కనీసం 5, 6 సంవత్సరాలు కదలక పోవడానికి అవ కాశం ఎక్కువ. ఈ లోగా వాడినుండి, కంపెనీవాళ్ళు వీలయినంత పని రాబట్టు కోవచ్చు' అన్నాడు. అయితే రామ్మోహన్ ఇలాంటి వ్యవహారాల్లో బాగానే అనుభవం గడించాడన్నమాట.

ఆ మర్నాడే రెడ్డిగారిని కలుసుకోగలి గలిగాము. ఆయన తనుచేయగలిగింది ఏమీ లేదనీ, అయినా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ విశ్వనాథ్‌ను కలుసుకొని రిక్వెస్టుచేస్తే అతను మంచివాడు కనుక సహాయం చెయ్య వచ్చనీ చెప్పారు. ఆయననూ విశ్వనాథ్‌కు టెలిఫోనుచెయ్యమని అడిగాను. రెడ్డిగారు 'అక్కర్లేదు. మీరు వెళ్ళి మాట్లాడండి. ఏమయిందో ఫోనులో చెప్పండి. మీరు రానవసరంలేదు' అన్నారు. వెంటనే ఆరబ్‌కి సరాయిలో ఉన్న ఎంప్లాయిమెంటు ఎక్స్ఛేంజికి వెళ్ళి విశ్వనాథ్‌ను కలుసుకొని రిక్వెస్టుచేసి రెడ్డిగారు ఆయన్ను కలుసుకోమని సలహా యిచ్చినట్లు చెప్పాను విశ్వనాథ్ కొంచెంసేపు ఆలోచించి 'అయితే మీరు ఏ ఉద్యోగంలో ప్రయత్నంచేస్తున్నారని' అడిగాడు. చెప్పాను. డి. జి. యస్. డి.లోవని సింగ్‌గారు చెప్పిన సలహాకూడా చెప్పాను. అప్పుడు విశ్వనాథ్ నవ్వి 'అది మీలాంటి ఉద్యోగపు వేటగాళ్ళ నుండి తప్పించుకొటానికి చెప్పేమాటలేకాని నిజంగా మేము మీపేరు పంపినా వాళ్ళు యింటర్వ్యూకు కూడా పిలవరు. అయినా సీరి యల్ఆర్డరులో కాండిడేట్లపేర్లు పంపాల్సిందే గాని వెనకాముందు చెయ్యడం వీలుండదు. అయినా డి.జి.యస్.డి.(డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సప్లయిస్ అండ్ డిస్పోసల్స్) మమ్మల్ని ఎప్పుడడిగినా 50, 60 మంది కన్నా తక్కువ అడగరు. కనుక మీకు గూడా 'కాల్'రావచ్చని అనుకుంటున్నాను' అన్నాడు.

తర్వాత 10 రోజులు యిలాంటి ప్రయ త్నాలతోనే గడిచిపోయాయి. ఈ లోగా నాలాగా ఉద్యోగాలకోసం ఢిల్లీ వచ్చి మెస్సుల్లో ఉంటున్నవారు మరి కొందరితో పరిచయాలేర్పడ్డాయి. ప్రతి రోజూ ఎవరులమేమి ఆఫీసులు తిరిగామో, ఏమేమి



ఫోల్డింగ్ 50 షాట్ పిస్టల్

లైసెన్సు అక్కరలేదు. అమెరికన్ మోడల్. దొంగలు, క్రూరమృగముల నుండి రక్షించుకోండి. ఉల్లాస ప్రదర్శనాలు, యాత్రలు, నాటకాలకు ప్రశస్తమైనది. ఆటోమేటిక్ 50 షాట్లు పేల్చుటకు కలదు. తేలికైనది. ఇందు నుండి వెలువడు మిణుగురు లవ్వలు మిమ్ములను కాపాడును. ధర: 50 షాట్లు జర్మన్ మోడల్ నెం. 99 రు.15/50. వి.పి.పి. చార్జీలు రు. 2/50. లెదర్ కేస్ రు.3/50. అదనపు షాట్లు 100కి రు. 5/-

JAPAN AGENCY (WAPT-15)
PHAPALA, ALIGARH.

క్రొత్తగా వచ్చినవి

ఆకర్షణీయమైన డిజైనులలోను, రంగులలోను సరికొత్త "కాశ్మీరు బ్యూటీ" చీరలు. పెద్ద సైజు మావద్ద మాత్రమే లభించును: వెల రు. 8/-, 2 చీరలు రు. 15/-, 3 చీరలు రు. 21/-, 4 చీరలు రు. 27/-. డీలక్స్ రకం చీరలు రు. 10/-, 2 చీరలు రు.19/-, 3 చీరలు రు. 27/-, 4 చీరలు రు. 35/-. ఏదైనా 2 లేక అంతకు మించి చీరలు కొన్నవారికి జాకెట్టు పీసు ఉచితము. వి. పి. పోస్టు పార్సల్ ద్వారా మీ ఇంటివద్ద డెలివరీ చేయబడును.

Ambica Saree Bhandar(PTW-30)
6815-Mandelia Road, Delhi-7



సెల్లు బ్రాంచి.
వెంకటేశ్వర మున్సిపల్ మార్కెట్
వినాయకస్వామి గుడివద్ద,
మెయిన్ రోడ్ — గుడివాడ.

ఇన్‌ఫ్లుయెన్స్

జరిగాయో అన్నీ చెప్పుకునేవాళ్ళం. నా కనిపించింది మాలో దాదాపు అందరికీ ఒక రకమైన సంఘటనలు ఎదురవుతున్నవని. ప్రతివాడూ ఎవరో ఒక ఆఫీసరుని పట్టుకోవడం ఆయన ఏదో విధంగా కొన్ని సలహాలి నిచ్చి పంపుతూండటమూ.

ఈ లోగా సూర్యనాథంగారు అమెరికా వెళ్ళిపోయారు. ఎకనామిక్ గ్రోత్ యిన్స్టిట్యూట్ నుండి ఏ కబురూ రాలేదు. సి. ఎస్. ఐ. ఆర్. (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసర్చి)లో ఒక సైంటిఫిక్ అసిస్టెంటు పోస్టుకు పేపరు అడ్వర్టయిజుమెంటు చూచి అప్లై చేశాను. ఇంటర్మీడియట్ చదువుతుండగా నేర్చుకొన్న షార్టుహాండు అక్కరకువచ్చి, లక్కీగా 'నయ్యర్ & కంపెనీ' అనే ఇంజనీరింగు కంపెనీలో 200 రూ.ల టెంపరరీ ఉద్యోగం దొరికింది. ఆ ఉద్యోగం చేస్తూ ఏదైనా మంచి ఉద్యోగం చూసుకోవచ్చన్న ఆశతో అక్కడ చేరాను. కాని యిదివరలో కలుసుకున్న వాళ్ళందరినీ వదలిపెట్టకుండా మధ్య మధ్య ఏమైనా అవకాశాలు వచ్చాయోమో తెలుసుకొంటూనే ఉన్నాను. ఒక్కొక్కసారి అనిపించేది హాయిగా గుంటూరు, బెజవాడల్లో ఏ కాలేజీలో నయినా డిమాన్‌స్ట్రేటరు ఉద్యోగం సంపాదించుకొన్నా యీ తిప్పలన్నీ ఉండేవి కావేమోనని. కాని అది యిచ్చే దాత మాత్రం ఎవడుతే, దానికి ఎన్ని తిప్పలు పడాలో అనుకొని సరిపెట్టుకునేవాడిని.

అలా 2 నెలలు గడిచిపోయాయి. డి. జి. ఎస్. డి. నుండి గాని, ఎకనామిక్ గ్రోత్ ఇన్స్టిట్యూట్ నుండి గాని ఏ కబురూ రాలేదు. ఒకనాడు, యిదివరలో నేను సి.ఎస్.ఐ.ఆర్. యొక్క నేషనల్ కెమికల్ లాబరేటరీకిపంపిన అప్లికేషనుకు యింటర్వ్యూ వచ్చింది. కంపెనీవాళ్ళకు ఈ సంగతి చెప్పకుండా సెలవు అతి కష్టంమీదా సంపాదించి యింటర్వ్యూకు వెళ్ళాను. సంతృప్తికరంగానే సమాధానాలు చెప్పాను. ఇంటర్వ్యూ అయిన వెంటనే సెలక్టయిన వాళ్ళ పేరును ప్రకటిస్తామన్నారు. అందులో నా పేరు వినగానే నా ఆనందానికి అంతు లేకపోయింది. ఇన్నాళ్ళకు ఎవరి సహాయం లేకుండా ఉద్యోగం సంపాదించుకోగలిగాను. ఢిల్లీలో మాదిరిగా యిక్కడ ఇంటికి అవస్థ పడక్కరలేదు. ఇక్కడి ఆఫీసుకు క్వార్టర్సు ఉన్నాయి. కొంత కాలంపాటు స్థిమితంగా జీవితం గడపవచ్చు. ఈ డిపార్టుమెంటులో ప్రతి పోస్టు పేపరులో అడ్వర్టయిజు చేసి ఇంటర్వ్యూద్వారా సెలెక్టు చేస్తారు గనుక సబ్జక్టులోనూ, చేసే పనుల్లోను ధరోగా ఉండి ఇన్‌చార్జి మెప్పు పొందేటట్లు పని చేస్తే ప్రమోషన్లు త్వరగానే రావచ్చు.

* * *

తమాషాగా ఉంటుంది గడచిన ఆ రోజులన్నీ యిలా గుర్తుకు వస్తుంటే. ఈ పదేళ్ళ కాలంలో చాలా మార్పులు వచ్చాయి నిజానికి. ఎన్.సి.ఎల్ నుండి అదే డిపార్టుమెంటులో ప్రమోషను మీద మైసూరుకు మారడం అక్కడ ఉద్యోగం చేస్తూనే పి. హెచ్.డి. పూర్తి చేసుకోవడం, అక్కడనుండి బెంగుళూరుకు, అక్కడనుండి యిక్కడకు ప్రమోషన్ల మీద మారడం జరిగింది. సంసారం కూడా కొద్దిగా పెరిగింది. ఇంకా ఎన్నో మార్పులు. ఇలా చాలాసార్లు గుర్తుకు వచ్చాయి గాని యీ రోజు ఆ రాఘవరావనే అతను ఉద్యోగంకోసం వచ్చి, నేను బిజీగా ఉన్నానని చెప్పినా వినకుండా తనయిబ్బందులు చెబుతూ తనకు మా ఆఫీసులో ఎల్లుండి జరగబోయే యింటర్వ్యూలో సహాయం చెయ్యమని మరీ మరీ బతిమలాడుతుంటే ఏం చెయ్యాలో తోచకపోయింది. ఎల్లుండి జరగబోయే ఇంటర్వ్యూలో నన్ను కూడా కమిటీ మెంబరుగా ఉండమని డైరక్టరునుండి ఈ రోజే ఇన్విటేషన్ వచ్చింది. ఇతనికి ఏ మాత్రం సహాయం చేయటానికి ప్రయత్నిద్దామన్నా యిదివరలో పేరుబడ్డ నా ఆంధ్ర పక్షపాతం మరింత పేరుబడుతుంది. ఎల్లుండి సెలక్షన్ కమిటీలో బల్‌రామ్ సింగ్ కూడా ఉంటాడు. అతను నాతో అప్పుడప్పుడు అంటూనే ఉంటాడు నవ్వుతూ, 'మూర్తి సాబ్‌కు తెలుగువాళ్ళంటే సాఫ్ట్ కార్నర్)' అని. అతన్నా

పెండార్కర్ కొన్ని యింటర్వ్యూలలో ఆ ఉద్యోగాలకు పూర్తిగా పనికిరాని వాళ్ళను సెలక్టు చేసుకోవడంలో సఫలీకృతులైనారు. నేను తెలుగువాళ్ళకు సహాయం చెయ్యలేదనను గాని నేను సహాయం చేసినవాళ్ళను వాళ్ళ యింటర్వ్యూలలో బాగా ఫేర్ చేసినవాళ్ళలో ఉన్నవారే. ఎటొచ్చి నేను చేసిన సహాయ మల్లా కుడి ఎడమగా ఉన్న వాళ్ళనల్లా వాళ్ళు బాగా ఫేర్ చేశారని చెప్పి నావంతు మార్కులు బాగా వేసి డైరక్టరును, మిగతా మెంబర్లను కన్విన్సు చేయడానికి ప్రయత్నం చెయ్యడమే. అలాగే కొన్ని సమయాల్లో నేను కూడా సఫలీకృతుడైనాను. కాని నేను బల్‌రావ్‌సింగ్, పెండార్కర్‌ల లాగా పనికిరానివాళ్ళను ఎప్పుడూ సెలక్టు చేద్దామని ప్రయత్నం చెయ్యలేదు. అదీ గాక ఈ రాఘవరావులాంటి వాళ్ళెవరైనా నన్ను పట్టుకొంటే వాళ్ళకు వాళ్ళ యింటర్వ్యూ వేయబడే ఉద్యోగం యొక్క డ్యూటీలను, వర్కును గురించి చెప్పి ఆ పద్ధతిలో ప్రిపేర్ కమ్మని చెప్పేవాడిని. వాళ్ళు అలాగే తయారయి వచ్చి యింటర్వ్యూల్లో బాగానే ఫేర్ చేసేవారు. నేను అప్పుడు ధైర్యంగా వాళ్ళ పేర్లు సజెస్టు చేసి యింటర్వ్యూ ఛైర్మన్ ముఖంలోకి చూసేవాడిని. ఆయనకి కూడా వీళ్ళ జవాబులు కొంత తృప్తినిచ్చి ఓ. కే. అనేవారు. కాని ఒకటి రెండుసార్లు అలా జరగగానే లేబరేటరీలో నా పేరు ఆంధ్రజన పక్షపాతిగా ప్రాకనారంభించింది. కాని బల్‌రావ్‌సింగ్, పెండార్కర్, వాళ్ళ క్రింద పనిచేసే వాళ్ళలో సగంమందిని వాళ్ళకు తెలిసిన వాళ్ళనుండి సెలక్టు చేయించుకున్నారు, ఆ కాండిడేట్లు యింటర్వ్యూలలో బాగా ఫేర్ చెయ్యకపోయినా. పైగా వీళ్ళే నా గురించి యిలా ప్రచారం చేస్తున్నారని కూడా నా అనుమానం. ఎప్పుడు నాన్‌గెజిటడ్ పోస్టులకు యింటర్వ్యూలు జరగనున్నా, వాటికి కొద్ది రోజులు ముందునుంచీ నా రూమువైపు కొందరి కళ్ళు కాపువేస్తుంటాయి. ఎవరన్నా క్రొత్త వాళ్ళు నన్ను కలుసుకొంటానికి వస్తారేమోనని. వచ్చేవాళ్ళకు యివేవీ తెలియవు. రావద్దని పంపివేయలేముకదా. వాళ్ళతో 5 నిముషాలు మాట్లాడి పంపినతర్వాత మర్నాడు అవమాట్లాడివెళ్ళిన తనయింటర్వ్యూకువస్తే అతన్ని దూరాన్నుంచి వేలెట్టిచూపుతూ గుసగుసలు. చివరికి అతను నా ప్రమేయం లేకుండా సెలక్టు కాగలిగినవాడయినా సరే, అతనిపేరు సజెస్టు చేయడానికి నాకు అవకాశం ఉండదు. ఎందుకంటే అంతకు ముందే ఎవడోఒకడు అడిగితీరతాడు 'నిన్న వచ్చినవాళ్ళు ఉద్యోగంకోసమేనా' అని. ఒకసారి నాకొ్ళనుమేటు, ప్రాణస్నేహితుడు అయిన విశ్వనాథం అతనిమేనల్లుడ్ని పంపాడు నావద్దకు. అతను ఎమ్మెస్సీ ఫస్టుక్లాసుతో రెండవవాడుగా పాసయ్యాడు. కుర్రవాడు మంచి చురుకుగా ఉన్నాడు. ఇంగ్లీషు బాగా మాట్లాడుతున్నాడు. ఎవ్వరి సహాయం లేకుండానే అతనికి ఉద్యోగం వస్తుంది. కాని విశ్వనాథం నన్ను అడిగాడు. అప్పుడు యింటర్వ్యూలో మరోమెంబరు ఎవర్నో సజెస్టుచేస్తే నేను అతనికంటె యితనే బాగా ఫేర్‌చేసాడని కమిటీ ఛైర్మనైన నత డైరక్టరుతో వాదించి అదృష్టవశాత్తు అయన్ని ఒప్పించగల్గాను. మరోసారి ఎవరో ముక్కూమొఖం తెలియని ఒక తెలుగు కుర్రాడు ఒక యింటర్వ్యూలో బాగా ఫేర్‌చేస్తే నేనతనిపేరు సజెస్టుచేశాను. అంతకుముందు ఆకుర్రాడు నన్ను కలుసుకోవడంగానీ, ఏమీ చేయలేదు. ఈసారి డైరక్టరు (సాధారణంగా నాన్‌గెజిటడ్ పోస్టుల యింటర్వ్యూ కమిటీలకు, ఈయనే ఛైర్మను) కూడా నా నిర్ణయం అనుమానించి మరొకమెంబరుతో ఏకీభవించాడు. అప్పుడూ గోలకావడం మాత్రం తప్పలేదు.

ఒక్కోసారి అనిపిస్తుంది, నాకున్న కొద్ది అవకాశంతో నేను తెలుగువాళ్ళకంటె యితర రాష్ట్రాలవాళ్ళకు ఈ ఉద్యోగాల విషయంలో సహాయపడగలగడం సులభమని, అలాగే తెలుగువాళ్ళు కూడా ఇతరులద్వారా పనిచేయించుకోవడం కొంచెం సులభం. ఎందుకంటే సహాయం చెయ్యడానికి ముఖ్యంగా ఈ ప్రాంతీయతే ప్రతిబంధకం. అదే నేను పరాయిరాష్ట్రాలవాళ్ళకు వరుసగ నలుగురైదుగురికి సహాయం చెయ్యడానికి ప్రయత్నించినాసరే నాకు చెడుపేరురాదు. కాని తెలుగువాళ్ళకు యిద్దరకు వరుసగా చేస్తే చాలు కావలసినంత చెడుపేరు సంపాదించుకోవడానికి. అలాగని నావద్దకు ఉద్యోగంకోసం వచ్చినవాళ్ళకు ఈ సలహా నేనిస్తే, నేను తప్పించుకుంటానికి ఈ నాటకం ఆడుతున్నానని చాటుకువెళ్ళి తిట్టుకుంటారు. ఇలాంటిబాధే కొద్ది, గొప్ప అవకాశాలు ఉద్యోగపు విషయాల్లో ఉన్న తెలుగువాళ్ళకు చాలమందికీ ఉన్నట్లు నాకు తెలుసు. అందుకే ఈమధ్య తెలుగు వాళ్ళెవరైనా ఉద్యోగవిషయమై నన్ను కలుసుకుంటే వెంటనే నాకు సి. యస్. టి. లోని మూర్తిగారు? సూర్యనాథంగారు మొదలైన నేను నా ఉద్యోగపు ప్రయత్నపు రోజుల్లో కలుసుకొన్న తెలుగు అధికారులు, వాళ్ళు నాకుచెప్పిన జవాబులు, సలహాలు అన్నీ ఒక్కసారి కళ్ళముందు కన్పడతాయి. ఇకనాకు అంతకంటె గత్యంతరంలేదు. కనుక ప్రస్తుతం నేనుకూడా అదేపంథాలో నడవాల్సి వస్తున్నది. ఎవరైనా ఉద్యోగం విషయాల్లో నేను వాళ్ళకు సహాయం చెయ్యగలననుకొని (ఒక్కొక్కసారి అది నిజంగా ప్రాప్తి అయినా) నావద్దకువస్తే, వాళ్ళకు మర్యాద చేసి, నాకు చేతనయినంతవరకు ప్రయత్నం చేస్తానుకాని గట్టిగా ఏసంగతి చెప్పలేననటం; అలాంటివాళ్ళలో సెలక్టుకానివాడు ఎవరైనా మళ్ళీవచ్చి ఏమండీ సహాయం చెయ్యలేదేమని అడిగితే, నేను చెయ్యగలిగినదంతా చేశాను కాని నా పై అధికారి తనకాండిడేటుకై గట్టి ప్రయత్నం చేసాడని చెప్పి కొంచెం నేను విచారించి పంపెయ్యడమే. కాని నాకు ఎప్పుడూ 'తెలుగువాళ్ళకు పరాయిరాష్ట్రాల లోగాని సెంట్రల్ గవర్నమెంటులోని ఉద్యోగాల విషయమై తెలుగువాళ్ళకంటె పరాయివాళ్ళద్వారా పనులు చేయించుకోవడం (అన్యాయం జరగకుండా చూసుకోవడం కూడా) సులభం' అనే సలహామాత్రం నావద్దకు ఉద్యోగానికై వచ్చిన ప్రతి ఒక్కడికీ యివ్వాలని ఉంటుంది అతను నమ్మితే. ●